"పెద్ద వాడికి వ్రాద్దామండీ! వాడు మిమ్మల్ని అమెరికాకు తీసుకువెళ్ళి ఆపరేషన్ చేయిస్తాడు." కాఫీ అందిస్తూ అంది శారదమ్మ హేమాద్రి రావుతో.

శారదమ్మ, హేమాద్రిరావు భార్యాభర్తలు. హేమాద్రిరావు కోపరేటివ్ డిపార్టుమెంటులో డిప్యూటీ రిజిస్ట్రారుగా రిటైరై హైదరాబాదులో ఒక చిన్న ఇల్లు కట్టుకొని సెటిల్ అయ్యాడు. ఆ చిన్న ఇంట్లో గూడా ఒక పోర్షను అద్దెకిచ్చాడు. అందులో వచ్చే అద్దె, పెన్షను, రిటైరైన తర్వాత ఒక ప్రవేటు కంపెనీలో పార్ట్‌టైమ్ అకౌంటెంటుగా పనిచేస్తున్నందువల్ల వచ్చే నెలసరి వెయ్యిరూపాయలూ కలిపి ఆ భార్యభర్తలు జీవనం సాగిస్తున్నారు.

హేమాద్రిరావుకు ఇద్దరు కొడుకులు. పెద్దవాడు ప్రణవమూర్తిని డాక్టరు చదివించి అమెరికాకు పంపాడు. పెద్దకోడలూ డాక్టరే. అమెరికాకు వెళ్ళిన పదేండ్లలో నాలుగేళ్ళ తర్వాత భార్య, ఇద్దరు కొడుకుల్ని తీసుకొని ఇండియాకు వచ్చి వెళ్లాడు ప్రణవమూర్తి. ఆ తర్వాత మళ్లీ రాలేదు. అమెరికాను, మనవళ్లను చూడాలని ఎన్నోసార్లు అనుకున్నా హేమాద్రి దంపతులకు ఆ అవకాశం రాలేదు. అక్కడ నుండి ఆహ్వానం అందలేదు.

"వద్దు శారదా! అమెరికాలో ఆపరేషన్ అంటే మాటలుకాదు. చాలా ఖర్చవుతుంది. వాడి నెత్తిన అంతభారం మోపడం న్యాయం లేదు" అన్నాడు హేమాద్రి.

"డాక్టరుకు తండ్రి అంటే అక్కడ కన్సెషన్ ఇస్తారనుకుంటానండి. పైగా వాడు దగ్గరుంటే మనకు భయం ఉండదు." చెప్పింది శారదమ్మ.

"అసలు విషయం నీకు చెప్పలేదు. నాకు మూత్రపిండం మార్పిడి చెయ్యాలన్నారు. సరిపడే మూత్రపిండం ఇచ్చే దాతల్ని మనమే వెతుక్కోవాలి. వాళ్ళు లక్షల మీదున్నారు. ఇంతా చేస్తే ఆపరేషన్ సక్సెస్ అవుతుందని భరోసా లేదు." విరాసక్తంగా అన్నాడు హేమాద్రి.

"అదంత ప్రమాదకరమైన ఆపరేషన్ కాదనుకుంటానండీ" మన వర్ధనమ్మ భర్త శంకర్రావుకు కూడా ఇక్కడే నిమ్స్‌లో ఈ మధ్యకిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేశారు. వాళ్ల కొడుకు రాజేంద్ర ఆయనకు తన కిడ్నీ ఒకటి ఇచ్చాడు." 'ధైర్యంతో అంది శారదమ్మ.

"నిజమే కిడ్నీ ఇచ్చినందువల్ల ఎవరి ఆరోగ్యము చెడదటగా.. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు వాళ్ళకు మన ఋణం తీర్చుకొనే అవకాశం వస్తుందండీ" అంది ఆమె.

"ఆపరేషన్ చేయకపోతే ఏ మౌతుంది? గతించిపోతాను. అంతేగా. ఇన్నాళ్లు బ్రతికింది చాలదా! ఇకపోవాలి. పిల్లలకు భవిష్యత్తు చూపించి వెళ్లిపోవాలి. భూమాతకు భారం తగ్గించాలి. కాకపోతే నీ విషయమే. నేను పోతే నిన్ను వాళ్లిద్దర్లో ఎవరైనా తీసుకెళ్లతారు." వేదాంత ధోరణిలో అన్నాడు హేమాద్రి.

"పిల్లలకు పెద్ద దిక్కులేకుండా అదేమి మాటలండీ." దీనంగా అంది ఆమె.

"ఇప్పుడు మనం ఉండి మాత్రం వాళ్లకు ఏ మాత్రం అండగా వున్నాం కాబట్టి.. అయినా అమెరికాకు పోవడమంటే సులభం కాదు. విమానఖర్చులు విపరీతంగా పెంచేశారు." నిట్టూరుస్తూ అన్నాడు అతను.

"మీరు అమెరికాకు అబ్బాయికి మీ టెస్టులన్నీ పంపుతూ జాబువ్రాయండి. వాడికి మీ మీద చాలా గౌరవమూ.. ప్రేమాను. తప్పక వాడు మనల్ని అమెరికాకు రమ్మంటాడు. బహుశ, వాడే తనకిడ్నీ ఒకటి ఇచ్చి మీకు ఆపరేషన్ చేయిస్తాడు." ఆశను నూరి పోస్తూ అంది ఆమె.

"అమెరికా విషయం మరచిపో శారదా, మన మక్కడికి వెళ్లితే వాళ్ళకు అంతా ఇక్కట్లే! ఒకవేళ అక్కడ మరణిస్తే భరించలేనంత వ్యయమౌతుంది." రేడియో ఆన్ చేస్తూ అన్నాడు హేమాద్రి.

పోనీ చిన్నవాడికి వ్రాయండి. బొంబాయిలో కూడా పెద్దహాస్పిటల్స్ ఉన్నాయిగా. అక్కడే చేయించుకుందురుగానీ" అంది ఆమె రేడియో ఆపుచేస్తూ. హేమాద్రి

చిన్నకొడుకు ప్రద్యుమ్నను ఎం.బి.ఎ. చదివించాడు. బొంబాయిలో రిజర్వు బ్యాంకులో ఉద్యోగం వేయించాడు.

"ఎక్కడైనా ఒక్కటే.. కనీసం రెండు లక్షలు ఖర్చు చెయ్యాలి. వాడూ ఇప్పుడిప్పుడే స్థిర పడుతున్నాడు. ఆడ పిల్లల తండ్రి... ముమ్ముందు అన్నీ అగచాట్లు" విరాసక్తంగా అన్నాడు హేమాద్రి.

"వాడు తనకిడ్నీ ఒకటి ఇస్తే ఖర్చులు అంత కావుగా, వాడు తప్పక అంగీకరిస్తాడు. మీకు మొగమాట మైతే నేను రాస్తాను వాడికి. మీరు పెద్దవాడికి వ్రాయండి.

పతీ - పత్నీ పరస్పరం



డా॥ మల్లెమాల వేణుగోపాలరెడ్డి

ఎలాగైనా మనం తెలియబరచాలికదా! ఆ తర్వాత వాడి ఇష్టం. నాకు పూర్తిగా నమ్మకముంది. వాడుమనల్ని అమెరికాకే రప్పించుకుంటాడు." నిశ్చయంగా అంది శారదమ్మ.

హేమాద్రిరావు ప్రణవమూర్తికి తన ఆరోగ్య పరిస్థితి వివరిస్తూ అమెరికాకు జాబు వ్రాసాడు. డాక్టర్ల రిపోర్టులు, సలహాలను జోడించి పంపాడు. కిడ్నీ మార్పిడి తప్పనిసరి అయినట్టు రిపోర్టుల్లో ఉంది. అక్కడ డాక్టర్ల సలహాకూడా తీసుకొని జవాబు వ్రాయమని వ్రాశాడు. రక్తసంబంధం ఉన్న వారి కిడ్నీ అయితే బాగా ఆపరేషన్ సక్సెస్ అవుతుందని కూడా డాక్టర్లు అన్నట్టు జాబు వ్రాశాడు.

శారదమ్మ ప్రద్యుమ్నకు తండ్రి ఆరోగ్య పరిస్థితి వివరిస్తూ జాబు వ్రాసింది. అన్నదమ్ముళ్లలో ఎవరో ఒకరు ఒక కిడ్నీ ఇస్తే అంతా సవ్యంగా జరిగిపోతుందని వ్రాసింది. బొంబాయిలో ఆపరేషన్ చెయ్యించాలన్న కోరికను తెలియజేసింది. గొప్పమనస్సుతో ఆలోచించమని అభ్యర్థించింది.

అమెరికా నుండి ప్రణవమూర్తి హేమాద్రి పక్కింటి ఫోనుకు ఫోన్‌చేశాడు. శారదమ్మతో మాట్లాడాడు. "ఇక్కడి డాక్టర్లు కూడా కిడ్నీ మార్పిడి ఒకటే మార్గమన్నారు. కానీ ఇక్కడ ట్రీట్‌మెంట్ చాలా ఖరీదు అక్కడే ఆపరేషన్ చేయించుకోవడం మంచిది. కిడ్నీ కావాలని న్యూస్‌పేపర్లో అడ్వర్‌టైజ్‌మెంట్ ఇవ్వండి. దానికి డబ్బు కావలిస్తే నేను పంపుతాను. ఈ సారి శీతాకాలపు సెలవులకు గానీ మేము ఇండియాకు రావడం కుదరదు. అప్పటి దాకా ఆపరేషన్ ఆపవద్దు. బొంబాయి వెళ్లి తమ్ముడి దగ్గరుండి అక్కడే జస్‌లోక్ హాస్పిటల్లో ఆపరేషన్ చెయ్యించండి. డబ్బు ప్రస్తుతానికి ఎక్కడైనా సర్దుకోండి. మేము ఇండియాకు వచ్చినప్పుడు పైకం పట్టుకొచ్చి ఇస్తాము. క్లుప్తంగా ఫోన్‌లో చెప్పాడు ప్రణవమూర్తి

శారదమ్మను ఫోన్‌లోని సమాధానం కృంగదీసింది. లోకం పోకడ తెలిసిన హేమాద్రికి ఈ విషయం నిరాశ కల్గించలేదు. ప్రద్యుమ్న నుండి ఉత్తరం వచ్చింది.

"నాన్నా! మీకీ పరిస్థితి వచ్చినందుకు నాకెంతో బాధగా ఉంది. నేను ఇప్పుడు సహాయం చేసే పరిస్థితిలో లేను ఈ మధ్యనే ఇల్లు కొనాలని లోన్ శాంక్షన్ చేయించుకున్నాను. అది బొటాబొటిగా ఇంటికి సరిపోతుంది. మీరు అన్నయ్యకు వ్రాయండి. అమెరికాకు వెళ్ళి ఆపరేషన్ చేయించుకోవడం మంచిది. అక్కడ వైద్య శాస్త్రం చాలా అధునాతనమైంది. పైగా అన్నయ్య వదినా ఇద్దరూ డాక్టర్లు. అన్నయ్యకు మీరు వ్రాస్తేచాలు. వెంటనే మీకు విమాన టికెట్లు పంపుతాడు. ఈ లోగా మీరు వీసా తెచ్చుకోండి. అమ్మను కూడా మీకు సాయంగా తీసుకుపోండి. ఆపరేషన్ అయిన తర్వాత మీరు కోలుకున్నాక కొంత కాలం అమెరికాలోనే వుండి అక్కడి ముఖ్య ప్రదేశాలు చూసిరండి." మళ్లీ తిరుగు ప్రశ్న వేయను అవకాశం లేకుండా సమాధానం వ్రాసాడు ప్రద్యుమ్న. హేమాద్రి నవ్వుకున్నాడు.

శారదమ్మకు చిన్నకోడలూ జాబు వ్రాసింది

"అత్తయ్యా, మీ ఉత్తరం చదివినప్పట్నించీ మాకెంతో కలవరంగా వుంది. అంత మంచి మావయ్యకు ఇంత కష్టం భగవంతుడు ఎందుకు తెచ్చిపెట్టాడో మరి. మీరు ప్రద్యుమ్నను తన కిడ్నీ ఒకటి ఇచ్చే విషయం మంచి మనస్సు చేసుకొని ఆలోచించమని వ్రాశారు. ఆయన అది చదివి చాలా మథన పడుతున్నాడు. ఈ మధ్య టూర్లు ఎక్కువై ఆయన ఆరోగ్యమూ అంత మాత్రంగానే వుంది. పైగా మాకిద్దరూ ఆడపిల్లలూ. కిడ్నీ ఇచ్చిన తర్వాత ఆయనకేమన్నా అయితే నేను దిక్కులేని దాన్నవుతాను. మీరు బావ దగ్గరికి అమెరికాకు వెళ్ళి ఆపరేషన్ చేయించుకోవడమే మంచిది. తప్పకుండా అక్కయ్యా, బావగారూ మిమ్మల్ని అప్యాయంగా చూసి ఆపరేషన్ చేయించి పంపుతారు. అమెరికా వెళ్ళగానే అక్కడి క్షేమసమాచారాలతో జాబు వ్రాయండి. మీరు అమెరికా నుండి తిరిగి వచ్చేటప్పుడు మీ చిన్న మనవరాలికి ఒక టాకింగ్ బేబీ డాల్ తీసుకురావాలట. నేను మీకు జాబు వ్రాస్తుంటే ప్రక్కనే కూర్చుని నానమ్మకు వ్రాయమని చెపుతూంది. మామగారికి మా నమస్కారములు. అమెరికాకు వెళ్ళే ముందు అమీర్‌పేటలోని ఆంజనేయస్వామికి అర్చన చేయించండి. మేము ఇక్కడ సాయిబాబా మందిరంలో ప్రార్థనలు చేస్తాము." సుతిమెత్తని మాటతో గుండె మీదికి కలం పోటు సారించిన చిన్న కోడలు జాబు చదువు కాని అందులోని విషయాలు హేమాద్రికి చెప్పకుండా తనలోనే దాచుకొని ఉత్తరం చించివేసింది శారదమ్మ.

శారదమ్మ దీర్ఘంగా ఆలోచించసాగింది. ప్రణవమూర్తికి అమెరికా ప్రయాణానికి, ప్రద్యుమ్న ఉద్యోగానికి వెచ్చించిన లాంఛే నాలు అప్పల ఖాతాలోనివే. హేమాద్రి రిటైరైన తర్వాత కొంత పెన్షన్ సరెండర్‌చేసి గ్రాట్యుయిటీలో జతచేసి అప్పు తీర్చాడు.

"పిల్లలు పెద్దవాళ్ళై ఉద్యోగాలలో సెటిలైతే మనకింకేం బాధ్యతలూ వుండవు శారదా! విశ్రాంతిగా, ఆనందంగా కాలం గడిపెయ్యొచ్చు. వాళ్ళ కోసం కాకపోతే ఇంకెవరికోసం ఈ శ్రమ. నా సంపాదనంతా ఖర్చుచేసి వాళ్ళను పెద్ద చదువులు చదివిస్తాను" హేమాద్రి మాటలు చేతల రూపానికొచ్చి కొడుకులు ప్రయోజకులైనారని మురిసిపోయింది శారదమ్మ. చేతి క్రిందికి ఎక్కివచ్చిన కొడుకులు చేయూతనిస్తారని ఆశ పడింది ఆమె. 'అపుత్రస్య గతిర్నాస్తి'. ఆ మాటకు అర్థమే లేదు. లేకపోతే ఇప్పుడు ఇద్దరు పుత్రులుండీ ఈ దుర్గతి ఎందుకు? ఈ సంధ్యా సమయంలో ఆర్థిక సహాయం అటుంచి నైతికంగానైనా అండగా నిలువని సుపుత్రులు... డబ్బు సంపాదించి పెట్టుతున్నంత కాలం నీ పరివారమంతా నీకు అనురక్తులై వుంటారు. ముసలితనం వచ్చి సంపాదన లేనివాడు నీ బిడ్డలైనా, నిన్ను చేరదీయరు" అదికంకరులన్న మాటలు ఇద్దరు అనుభవంలోకి వచ్చాయి.

తనకు ప్రత్యక్ష దైవమైన భర్తకు అవయవ దానం కావాలి. పురాణ గాథల్లో ముసలి తండ్రి కుమారుణ్ణి తన యవ్వనం దానమడిగాడు. అడిగిందే భాగ్యంగా తన యవ్వనాన్ని దానమిచ్చి చరిత్రకెక్కాడాకుమారుడు. ఇప్పుడు నడుస్తున్న చరిత్ర అందుకు భిన్నం. ఇన్నాళ్లు అనురాగం పంచి, ఆప్యాయతను పెంచి తనలో సగంగా చూసుకున్న తన దైవానికి ఆపరేషన్ ఎలాగైనా చేయించాలి. రెండో మాట మాట్లాడనివ్వకుండా భర్తను ఆపరేషన్‌కు ఒప్పించింది.

మర్నాడు హేమాద్రి శారదమ్మతో అన్నాడు.

"శారదా, నీ మాట ప్రకారమే జరగనివ్వు. కిడ్నీ కోసం పేపర్లో ప్రకటనిస్తాను. ప్రభుత్వానికీ, స్వచ్ఛంద సంస్థలకూ సహాయం కోసం అప్లికేషన్ వేస్తాను. బ్యాంక్ అకౌంటులో నలభై వేలుందనుకుంటాను. అంతా కలిపితే ఆపరేషన్ చేయించుకుని గట్టెక్కవచ్చు. ఆపరేషన్ సక్సెస్ అయితే ఇంకా పదేళ్ల వరకూ ప్రాణానికి ధోకా లేదన్నారు డాక్టర్లు. పదేళ్లు ప్రైవేటు ఉద్యోగం చేస్తే మన కష్టాలు కరిగిపోతాయి. నేను బ్యాంకకు వెళ్ళి అకౌంట్ చూసి వస్తాను" కృతనిశ్చయంతో అన్నాడు హేమాద్రి.

బ్యాంకకు ప్యాస్ పుస్తకంతో వెళ్ళాడు హేమాద్రి. తిరిగి వచ్చేటప్పటికి ఇల్లు తాళం వేసి వుంది. ప్రక్కవాటావాళ్ళు తాళం చెవి తెచ్చి ఇచ్చారు. ఏదో పెద్ద కవరు పట్టుకొని ఆటోలో బయటికి వెళ్ళింది శారదమ్మ అని చెప్పారు వాళ్ళు.

హేమాద్రికి ఆశ్చర్యం వేసింది. ఆమె ఎక్కడికెళ్లినట్టు... ఒంటరిగా ఎప్పుడూ బయటికి వెళ్ళదు శారదమ్మ... ఆమె రావడం ఆలస్యమయ్యేకొద్దీ ఆతురత ఎక్కువైంది హేమాద్రికి. మధ్యాహ్నం రెండు గంటలకు ఆటో దిగింది శారదమ్మ. ఆమె చేతిలో హేమాద్రి హెల్త్ తాలూకు ఫైలూ, ఎక్స్‌రేలు వున్నాయి.

"ఏమండీ! మన సమస్యకు పరిష్కారం దొరికిందండీ! మీరు కిడ్నీ కోసం పేపర్లో ప్రకటనివ్వనవసరం లేదు. నేను మన డాక్టర్ని కలిసి వచ్చాను. ఆయన నాకూ పరీక్షలు చేయించారు. అన్నీ సరిగ్గా వున్నాయట. నా కిడ్నీ సరిపోతుందన్నారు. నేనిస్తాను మీకు కిడ్నీ. ఆపరేషన్ ఖర్చులకు బ్యాంక్‌లో డబ్బు సరిపోతుంది. ఎందుకైనా కొంచెం ఎక్కువ డబ్బు వుంచుకోవడం మంచిదని ఇదిగో నా బంగారు గాజులు అమ్మేశాను. ఇరవై వేలు వచ్చాయి. ఇక ఆలస్యం చేయవద్దు. ప్రభుత్వానికీ, స్వచ్ఛంద సంస్థలకు మీరు ఆర్థిక సహాయం కోసం అభ్యర్థనలు పంపవద్దు. అమెరికా వాళ్ళను ఆలోచనలో పెట్టవద్దు. బొంబాయి వాళ్ళను ఇరకాటంలో ఇరికించవద్దు. ఇక్కడే... హైదరాబాదులోనే... గాంధీ హాస్పిటల్లో ఆపరేషన్ చేస్తామన్నారు డాక్టరుగారు. ప్రాణాపాయం ఏమీ లేదన్నారు. ఇంకొక్క క్షణం ఆగవద్దు. మీరు వెంటనే వెళ్ళి డాక్టర్ని కలిసి ఆపరేషన్‌కు డేట్ ఫిక్స్ చేయించుకు రండి" శారదమ్మ మనసు నిండా ఆత్మవిశ్వాసం, కండ్ల నిండా ప్రేమానురాగాలు ప్రస్ఫుటించాయి. ఆమె గుండె పరితృప్తితో నిండిపోయింది.

"శారదా", కండ్ల నుంచి నీళ్ళు కారుతుండగా గట్టిగా ఆమె చేతులు పట్టుకున్నాడు హేమాద్రి. ఆయన హృదయం ఉప్పొంగింది. గుండెధైర్యం ఏ మాత్రం సడలకుండా అతనికి అండగా నిలబడింది శారదమ్మ.

ఆపరేషన్ సక్సెస్ అయింది. ఇద్దరూ ఆరోగ్యంగా తిరిగి వచ్చారు హాస్పిటల్ నుంచి. చిన్న మనవరాలికి టాకింగ్ డాల్ కొని పంపింది శారదమ్మ. ఆంజనేయస్వామికి ఆకు పూజ చేయించింది. హృదయంలోనే కొలువైన అంతరి దేవతలకు నమస్కరించింది.

మనసా, వాచా, కర్మణా ఇద్దరూ నూటికి నూరుపాళ్ళు హేమాద్రిరావు అర్ధాంగి అయింది శారదమ్మ. ఆయనలో అంతర్గంగా లీనమైపోయింది.